# ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ అంకిత్

**విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం -పాఠశాల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులపై ఆరా**

**పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు ఆదేశం**



**కొత్తగూడెం, ఏప్రిల్ 07**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన 'ఇంటిగ్రేటెడ్ పాఠశాల' పనుల్లో వేగం పెరిగింది. మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ అశ్వరావుపేట పర్యటనలో భాగంగా ఈ పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు అత్యాధునిక వసతులతో కూడిన విద్యా కేంద్రాన్ని నిర్మించేందుకు అనువైన స్థలం మరియు ఇతర భౌగోళిక పరిస్థితులను ఆయన క్షేత్రస్థాయిలో అంచనా వేశారు. పరిశీలన సందర్భంగా కలెక్టర్ సంబంధిత రెవెన్యూ మరియు విద్యాశాఖ అధికారుల నుంచి స్థలం విస్తీర్ణానికి సంబంధించిన మ్యాపులను, వివరాలను సేకరించారు. పాఠశాల నిర్మించే ప్రాంతానికి విద్యార్థులు చేరుకునేందుకు రవాణా మార్గాలు ఎలా ఉన్నాయి, తాగునీరు మరియు విద్యుత్ వంటి కనీస మౌలిక వసతుల లభ్యత ఏ మేరకు ఉందనే అంశాలపై అధికారులతో చర్చించారు. భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్య పెరిగినా ఇబ్బంది లేకుండా విశాలమైన ప్రాంగణం ఉండేలా ప్లాన్ చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులందరికీ ఒకే చోట అన్ని రకాల వసతులు, నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల కాన్సెప్ట్‌ను తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో అశ్వరావుపేటలో నిర్మించబోయే ఈ పాఠశాల నమూనా మరియు నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. స్థల సేకరణకు సంబంధించి ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరించి, నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ కిషోర్, ఎంపీడీవో అప్పారావు మరియు ఇతర శాఖల అధికారులు ఉన్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల అందుబాటులోకి వస్తే కార్పొరేట్ స్థాయి విద్యా వసతులు సామాన్యులకు కూడా దక్కుతాయని ఆయన పేర్కొన్నారు. నిర్ణీత కాలవ్యవధిలోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయడమే తమ ప్రాధాన్యత అని అధికారులు వెల్లడించారు.జిల్లా యంత్రాంగం ఇప్పటికే పాఠశాల నిర్మాణానికి సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి పంపింది. కలెక్టర్ పర్యటనతో క్షేత్రస్థాయిలో ఉన్న అడ్డంకులు తొలగిపోయి పనులు వేగవంతం కానున్నాయి. అశ్వరావుపేట నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఒక వరంలా మారుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యా శాఖతో పాటు రోడ్లు, భవనాల శాఖ అధికారులు కూడా సమన్వయంతో పనిచేసి భవన నిర్మాణ పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

# డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ 'సంఘటన్ శ్రీజన్ అభియాన్'**

**టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కొలువుదీరిన కొత్త కమిటీ**

**పార్టీ బలోపేతమే లక్ష్యంగా భారీ బహిరంగ సభ - మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సమక్షంలో ఘనంగా కార్యక్రమం**

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 07**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు చేపట్టిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, నూతనంగా ఎంపికైన డీసీసీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు వారధిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరియు స్థానిక ఎమ్మెల్యే వంశీ కృష్ణ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. పార్టీ క్రమశిక్షణను పాటిస్తూ, రాబోయే ఎన్నికల నాటికి కేడర్‌ను సమాయత్తం చేయడమే ఈ 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' ప్రధాన ఉద్దేశ్యమని వంశీ కృష్ణ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సభ్యులు పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణా రావు పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా పాలనలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని ఆయన కోరారు. ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయని కొనియాడారు. పార్టీ సంస్థాగత నిర్మాణం బలోపేతం కావడం వల్ల భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించవచ్చని ఆయన ధీమా వ్యక్తం చేశారు.సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి, స్థానిక



ఎంపీ మల్లు రవి తమ ప్రసంగాల ద్వారా కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణలో నాయకులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కూడా పాల్గొని జిల్లాలో పార్టీ ఎదుగుదలకు తాము అందిస్తున్న సహకారాన్ని వివరించారు. ఈ స్థాయి భారీ సమావేశం నిర్వహించడం ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తన పట్టును మరోసారి నిరూపించుకుంది. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉండి ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, ఇది జనాల్లోకి వెళ్లేందుకు ఒక పునాది అని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్తేజం నెలకొంది. త్వరలోనే మండల స్థాయి కమిటీలను కూడా పూర్తిస్థాయిలో ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# జర్నలిజం పేరుతో రాధాకృష్ణ బ్రోకరిజం చేస్తున్నారు

**ఆర్కేపై రోజా విరుచుకుపాటు - అమరావతికి రెండు లక్షల కోట్లు ఎక్కడివని మాజీ మంత్రి ప్రశ్న**

**మహిళలను కించపరిస్తే ఆంధ్రజ్యోతి కార్యాలయాన్ని తగలబెడతామని హెచ్చరిక**

**రేవంత్, చంద్రబాబు చీకటి ఒప్పందాలతో ఏపీకి అన్యాయం జరుగుతోందని ఆరోపణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 07**

హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నేతల దాడి యత్నం ఘటన తెలుగు రాష్ట్రాల్లో కాక రేపుతోంది. ఈ నేపథ్యంలో తిరుపతిలో ఆంధ్రజ్యోతి పత్రికకు వ్యతిరేకంగా వైసీపీ శ్రేణులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఏబీఎన్ ఎండీ వేమూరి రాధాకృష్ణపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాధాకృష్ణ జర్నలిజం ముసుగులో బ్రోకరిజం చేస్తున్నారని, 'కొత్త పలుకు' పేరుతో మహిళలను, వైసీపీ నాయకుల కుటుంబ సభ్యులను కించపరిచేలా వ్యవహరిస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. అవాస్తవ కథనాలతో విషం చిమ్మడం మానుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు.రాధాకృష్ణ ఆర్థిక ఎదుగుదలపై రోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు డొక్కు సైకిల్‌పై తిరిగిన వ్యక్తి, నేడు వేల కోట్లకు ఎలా ఎదిగారో ప్రజలందరికీ తెలుసని ఆమె ఎద్దేవా చేశారు. కేవలం చంద్రబాబుకు బ్రోకర్‌గా పనులు చేస్తూ, రాజకీయ లబ్ధి కోసం మీడియాను వాడుకుంటున్నారని ఆరోపించారు. కూటమి నేతలు తమపై తిట్టించడం మొదలుపెడితే, తాము కూడా అంతకంటే గట్టిగా జవాబు చెప్పగలమని, తమ సంస్కారం అడ్డు వస్తోందని మండిపడ్డారు. పద్ధతి మార్చుకోకపోతే ఆంధ్రజ్యోతి కార్యాలయాన్ని తగలబెట్టడానికి కూడా వెనకాడబోమని ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించాయి.రాష్ట్ర అభివృద్ధిపై చంద్రబాబు వైఖరిని రోజా తీవ్రంగా తప్పుబట్టారు. రాయలసీమలో పుట్టిన చంద్రబాబు, ఈ ప్రాంతానికే తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం కేవలం 2 వేల కోట్లు ఖర్చు చేయలేని వ్యక్తి, అమరావతి కోసం 2 లక్షల కోట్లు ఎలా ఖర్చు చేస్తారని ఆమె నిలదీశారు. అమరావతి పేరుతో భారీ ఎత్తున నిధులను మళ్లించి,



రాయలసీమను ఎడారిగా మార్చాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధిని విస్మరించి కేవలం ఒక ప్రాంతానికే ప్రాధాన్యత ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని ఆమె అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద చంద్రబాబు తాకట్టు పెట్టారని రోజా ఆరోపించారు. వీరిద్దరి మధ్య చీకటి ఒప్పందాలు జరిగాయని, అందుకే 87 శాతం పూర్తయిన రాయలసీమ ప్రాజెక్టులను ఇప్పుడు నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టులను అడ్డుకోవడం అంటే ఈ ప్రాంత ప్రజల గొంతు కోయడమేనని, దీనిపై తాము మహా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. కృష్ణా నది జలాల్లో ఏపీ వాటాను కాపాడటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రోజా విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు పాల్గొని ఆంధ్రజ్యోతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# వడ్డీ వ్యాపారం నుండి ఆదివాసులను విముక్తి పరచాలి

**ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ**

**జాతీయ అధ్యక్షులు ఈసం సుధాకర్ .**

**రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్**



**గంగారం ఏప్రిల్ 7:**

గంగారం మండలంలోని ఏజెన్సీ గ్రామం దుబ్బగూడెం గిరిజనేతర్ల అక్రమ అధిక వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా తాడ్వాయి మండలం లోని లింగాల గ్రామం స్థూపం వద్ద నుండి దుబ్బగూడం వరకు పాదయాత్ర చేసి బుధవారం సభ నిర్వహించారు సభాధ్యక్షులు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కుంజ నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించారు,ముఖ్య అతిథులుగా తుడుందెబ్బ జాతీయ అధ్యక్షులు ఈసం. సుధాకర్‌రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ గ పాల్గొని ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతరులు 1/70 1/66 పెసా 1996 చట్టాల ప్రకారం గిరిజనేతరులు ఇచ్చినటువంటి అప్పులు సుమారుగా వడ్డీకి వడ్డీ పెంచుకుంటూ చక్ర వడ్డీలు ఆఖరికి విష్ణు చక్ర వడ్డీ కూడా ఆదివాసుల పైన మోపి ఒక్కొక్క కుటుంబానికి అరకోటి రూపాయలు అనగా 50 లక్షలు అప్పుగాయించి వారి యొక్క భూములను లాక్కొని మహిళలను అణచివేతకు గురి చేస్తూ షెడ్యూల్ ఏరియా అంటే గిరిజనేతరులు గాలి కూడా పిలవడానికి వీలులేదని గిరిజనేతర్లు ఇచ్చినటువంటి అక్రమ అధిక వడ్డీ వ్యాపార అప్పులను దుబ్బగూడెం పిసా గ్రామసభలో అప్పులు మాఫీ చేయుటకు గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఇట్టి తీర్మానాన్ని 29 శాఖల అధికారులు అమలు చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి దెబ్బ డిమాండ్ చేస్తుంది.జిల్లా కలెక్టర్, పిఓ ఐటీడీఏ, జిల్లా వ్యవసాయ అధికారి అధికారులు స్పందించి దుబ్బగూడెం మరియు ఇతర గ్రామాల ఆదివాసీల సమస్యలు. తక్షణమే స్పందించి వారికి బ్యాంకు లోన్లు క్రాప్ లోన్లు ఇవ్వాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నాము. గిరినేతర్లు లాక్కున్నటువంటి భూములను తిరిగి ఆదివాసులకు అప్పగించాలని. తుడుందెబ్బ డిమాండ్ చేస్తుంది సమస్యలు పరిష్కరించని ఎడల ర్యాలీలు ధర్నాలు రాస్తారోకోలు చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కోడం వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు పడిగే నాగేశ్వరరావు దొర, సిద్ధబోయిన సంజీవ, మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు తాటి సునీల్ ,రామారావు, కల్తి శేఖర్, గంగారం మండల అధ్యక్షులు గొంది వినయ్, సర్పంచ్ పూనెం సంధ్యా రాణి, మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు ఈసం కాంతారావు, సువర్ణ పాక లక్ష్మయ్య దొర, పటేల్ సువర్ణపాక నాగేశ్వరరావు పోలేబోయిన సమ్మయ్య యువతు అధ్యక్షులు సువర్ణపాక నరేందర్ పూనం సందీప్ సువర్ణపాక శ్రీను,లింగాల బంధాల ,నర్సాపురం, అల్లిగూడెం ,గొల్లపెల్లి, పోసాపురం, పోటుగూడెం, కొడిశెల,రామారం, పోనుగొండ్ల గ్రామస్తులందరూ పాల్గొన్నారు.

# 'ఇవేం మినిట్స్'

**కోర్టుల్లో చర్చలకు, ఉత్తరప్రత్యుత్తరాలకు వినియోగించొద్దు**

**జలవివాద పరిష్కార కమిటీ మినిట్స్‌పై అభ్యంతరం**

**కేంద్ర జలవనరుల సంఘానికి తెలంగాణ ఘాటు లేఖ**

**హైదరాబాద్, ఏప్రిల్ 7**

తెలంగాణ, ఏపీల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఏర్పాటైన కమిటీ గత జనవరి 30న ఢిల్లీలో తొలిసారి సమావేశమైంది. ఈ సందర్భంగా చర్చించిన అంశాలతో రూపొందించిన మినిట్స్‌లో అవాస్తవాలున్నాయని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఛైర్మన్ అధ్యక్షతన ఈకమిటీని కేంద్ర జలశక్తిశాఖ ఏర్పాటు చేసింది. సీడబ్ల్యూసీ సభ్యకార్యదర్శి, కృష్ణాబోర్డు సభ్యులు ఇచ్చిన ప్రజెంటేషన్లలోని పలు అభిప్రాయాలు అవాస్తవమని, కోర్టులు, ట్రైబ్యునళ్లు వీటిని రిఫరెన్స్‌లుగా తీసుకుంటే తమ వాదనలకు నష్టం జరుగుతుందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం/రాష్ట్రం/ఇతర సంస్థ కూడా ఇందులో పేర్కొన్న అసంపూర్ణ చర్చలను ఏ కోర్టులోనూ చర్చ, ఉత్తరప్రత్యుత్తరాలకు వాడకూడదని చెప్పింది. మినిట్స్‌లోని పేరా 8(1),(2)తో మినహా ఇతర అంశాలను అంగీకరించబోమంది. ఈ మేరకు సీడబ్ల్యూసీ ప్రాజెక్టు అప్రైజల్ విభాగం డైరెక్టర్‌కు తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్ లేఖ రాశారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు అక్కడినుంచి పెన్నాకు తరలించడానికి ఏపీ చేసిన పోలవరం -బనకచర్ల ఎత్తిపోతల ప్రతిపాదనలు.. సహజన్యాయ సూత్రాలకు విరుద్ధమని చెప్పినప్పటికీ మినిట్స్‌లో చేర్చలేదన్నారు. వరద జలాలపై ప్రతిపాదించిన ప్రాజెక్టుల డీపీఆర్‌ల పరిశీలనకు మార్గదర్శకాలు లేవని, ఏ విధంగా వీటిని మదింపు చేస్తున్నారన్నారు. గోదావరి పరీవాహకంలో నీటి లభ్యతను నిర్ధారించడం గానీ, పరీవాహకంలోని రాష్ట్రాలకు నిర్దిష్ట పరిమాణంలో కేటాయింపులు జరపడం కానీ గోదావరి ట్రైబ్యునల్ చేయలేదని మినిట్స్‌లో సీడబ్ల్యూసీ పేర్కొనడం సరైంది కాదన్నారు. వివిధ అంతర్రాష్ట్ర ఒప్పందాల ఆధారంగా గోదావరి ట్రైబ్యునల్ పరీవాహక ప్రాంత రాష్ట్రాలకు నిర్దేశిత ప్రాంతాల వద్ద నీటి లభ్యత ఆధారంగా సరైన పరిమాణంతో కూడిన నిబంధనల రూపంలో నీటి కేటాయింపులు చేసిందని, గోదావరి ట్రైబ్యునల్ తీర్పుకి జత చేసిన అనుబంధం-బీలో వివిధ సబ్ బేసిన్లలోని నీటి వినియోగంపై స్పష్టత ఉందన్నారు. 2023 జూన్‌లో సీడబ్ల్యూసీ నివేదిక ప్రకారం గోదావరి పరీవాహకంలో 75శాతం డిపెండబుల్టీ 3397 టీఎంసీల లభ్యత ఉందని, ఇందులో ఉమ్మడి ఏపీకి 1435 టీఎంసీలు లభ్యతలోకి ఉన్నాయన్నారు.

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కార్యాలయం ప్రారంభం

**ఐటీ కారిడార్‌లో పాలన మరింత చేరువ**

**ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**హైటెక్ సిటీ ఎన్‌ఏసీ భవనంలో నూతన కార్యాలయ ఏర్పాటు**



**హైదరాబాద్, ఏప్రిల్ 07**

ఐటీ కారిడార్ పరిధిలోని ప్రజలకు మెరుగైన పురపాలక సేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. హైటెక్ సిటీ, ఇజ్జత్‌నగర్‌లోని ఎన్‌ఏసీ భవనంలోని రెండో అంతస్తులో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రభుత్వ పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ నూతన కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలనను మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యాలయ నిర్మాణం ఒక కీలక అడుగు అని జయేష్ రంజన్ పేర్కొన్నారు. పెరుగుతున్న ఐటీ హబ్ అవసరాలకు అనుగుణంగా వేగవంతమైన సేవలు అందించడానికి ఈ కేంద్రీకృత కార్యాలయం దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన ఈ ఆఫీసు ద్వారా పౌర సేవలు మరింత పారదర్శకంగా, సులభంగా అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా ఐటీ కంపెనీలు, స్థానిక నివాసితుల సమస్యల పరిష్కారానికి ఇది వేదికగా మారనుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు మరియు వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. కొత్త కార్యాలయ ఏర్పాటుతో అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుందని, తద్వారా అభివృద్ధి పనుల పర్యవేక్షణ సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. సైబరాబాద్ పరిధిలోని మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం మరియు పచ్చదనం పెంపొందించే దిశగా ఈ యంత్రాంగం ఇకపై ఇక్కడి నుంచే పూర్తిస్థాయిలో కార్యకలాపాలు సాగించనుంది. కార్యాలయం ప్రారంభం అనంతరం జయేష్ రంజన్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సైబరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని, టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కొత్త భవనం కేవలం అడ్మినిస్ట్రేషన్ సెంటర్ మాత్రమే కాకుండా, ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన సేవల కేంద్రంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఐటీ కారిడార్‌లోని ట్రాఫిక్, వ్యర్థాల నిర్వహణ వంటి ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మరియు ఎంఏయూడీ శాఖకు చెందిన పలువురు సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. హైటెక్ సిటీ నడిబొడ్డున కార్యాలయం ఉండటం వల్ల ప్రజలకు మరియు ప్రతినిధులకు రాకపోకలు సులభతరం అవుతాయని పలువురు హర్షం వ్యక్తం చేశారు. టీమ్ సైబరాబాద్ సమన్వయంతో పనిచేస్తూ నగరాభివృద్ధిలో కొత్త రికార్డులు సృష్టించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. రేపటి నుంచి ఈ నూతన కార్యాలయం నుంచి అన్ని విభాగాల సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

# గ్రంథాలయాలు మనోవిజ్ఞాన నిలయాలు

**ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో లైబ్రరీల ఏర్పాటుకు విజ్ఞప్తి**

**ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకుడు కోల శ్రీకాంత్**

**గ్రంథాలయాల ద్వారా విషయ పరిజ్ఞానం, - మానసిక స్థైర్యం పెంపొందుతుందని వెల్లడి**



**హైదరాబాద్, ఏప్రిల్ 07**

గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు మాత్రమే కాదని, అవి మానవ మనోవిజ్ఞాన పెంపుదలకు ప్రధాన కేంద్రాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అభిప్రాయపడ్డారు. మంగళవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు కోల శ్రీకాంత్ ముదిరాజ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని డివిజన్లలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ విన్నపంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, విద్యావంతులైన యువతకు మరియు విద్యార్థులకు గ్రంథాలయాల అవశ్యకత ఎంతో ఉందని పేర్కొన్నారు. నేటి డిజిటల్ యుగంలో కూడా పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు అపారమని ఎమ్మెల్యే వివేకానంద్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని గ్రంథాలయాలలో కేటాయించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తకాలు చదవడం వల్ల లోక జ్ఞానంతో పాటు విషయ పరిజ్ఞానం మెరుగుపడుతుందని, ఇది మానసిక ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు నియోజకవర్గవ్యాప్తంగా అందుబాటులో ఉండే గ్రంథాలయాలు ఎంతో తోడ్పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రతినిధిగా నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా విద్యా సౌకర్యాలకు తాను ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించి, అన్ని డివిజన్లలో గ్రంథాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ మరియు నిధుల కేటాయింపుపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయాలను కూడా ఆధునీకరించి, మరిన్ని నూతన పుస్తకాలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను గుర్తించి వినతిపత్రం అందజేసిన నాయకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజశేఖర్, విక్రమ్ రెడ్డి, కేశవ్ యాదవ్, యోగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని యువత విజ్ఞానవంతులుగా ఎదగడమే తమ లక్ష్యమని, అందుకోసం అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. స్థానిక డివిజన్లలో గ్రంథాలయాలు అందుబాటులోకి వస్తే సామాన్యులకు కూడా విజ్ఞానం చేరువవుతుందని నాయకులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.

# ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

**రూ. 1200 కోట్ల భూమి స్వాధీనం - బడా నిర్మాణ సంస్థల ఆక్రమణలో ఉన్న 8 ఎకరాల భూమికి విముక్తి**

**ఖానామెట్‌లో వాసవి, మీనాక్షి సంస్థలు వేసిన షెడ్ల తొలగింపు - ఏవీ రంగనాథ్ ఆదేశాలతో ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 07**



హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలో హైడ్రా మరోసారి ఉక్కుపాదం మోపింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లో బడా రియల్ ఎస్టేట్ సంస్థల స్వాధీనంలో ఉన్న సుమారు 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ హబ్‌కు అత్యంత చేరువలో ఉన్న సర్వే నంబర్ 55లోని ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్ ధర ప్రకారం సుమారు రూ. 1200 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ప్రభుత్వ భూమిని కాపాడటమే లక్ష్యంగా హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు అధికారులు ఈ భారీ ఆపరేషన్ నిర్వహించారు. ఈ భూమిలో మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థతో పాటు వాసవి నిర్మాణ సంస్థ అక్రమంగా తాత్కాలిక షెడ్లు, ఆర్‌సీసీ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాయి. మొత్తం 4.20 ఎకరాల భూమిని తమ స్వాధీనంలో ఉంచుకుని నిర్మాణ సామగ్రిని నిల్వ చేశాయి. అదేవిధంగా, కొలను మాధవరెడ్డి కుమార్తె కొలను సబిత మరో 4 ఎకరాల భూమిని తనదిగా పేర్కొంటూ బౌన్సర్లను కాపలా పెట్టింది. అయితే, రంగారెడ్డి కలెక్టర్ ఇప్పటికే ఈ భూమిని ప్రోహిబిటెడ్ (నిషిద్ధ) జాబితాలో చేర్చిన నేపథ్యంలో, హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఇది అసైన్డ్ ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి ఆక్రమణల తొలగింపు ప్రక్రియ మొదలైంది. హైడ్రా చర్యలతో వాసవి నిర్మాణ సంస్థ తాము ఏర్పాటు చేసిన ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించుకోగా, కార్మికుల కోసం వేసిన షెడ్లను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. ఖానామెట్ సర్వే నంబర్ 55లో ఉన్న ఈ 8 ఎకరాలకు పైగా భూమి చుట్టూ అధికారులు తక్షణమే ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ హైడ్రా బోర్డులను ప్రతిష్టించారు. గతంలోనూ ఇదే సర్వే నంబర్ మరియు సమీపంలోని మొండికుంట వద్ద హైడ్రా 11 ఎకరాల వరకు భూమిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజా చర్యలతో అక్రమార్కులకు బలమైన హెచ్చరికలు పంపినట్లయింది. ప్రభుత్వ భూములను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తి లేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఐటీ కారిడార్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో భూ మాఫియా కన్ను పడకుండా నిరంతరం నిఘా ఉంచుతామని వెల్లడించారు. శేరిలింగంపల్లి మండలంలో ఆక్రమణలకు గురైన మరిన్ని ప్రభుత్వ స్థలాలను గుర్తించి త్వరలోనే వాటిపై కూడా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. రూ. 1200 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడటం పట్ల సామాన్య ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు.

# హెచ్ఆర్సీ వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

**గాంధీనగర్ పోలీసుల వేధింపులే కారణమంటూ నిరసన**

**నాంపల్లి మానవ హక్కుల కమిషన్ కార్యాలయం వద్ద కలకలం**

**కవాడిగూడకు చెందిన శ్రావణి పెట్రోల్ పోసుకుని ఆవేదన**

**సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన పోలీసులు**



**హైదరాబాద్, ఏప్రిల్ 07**

నగరంలోని నాంపల్లిలో ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. కవాడిగూడ ప్రాంతానికి చెందిన శ్రావణి అనే మహిళ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌ను తీసి ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గాంధీనగర్ పోలీసులు తనను తీవ్రంగా వేధిస్తున్నారని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదనే ఆవేదనతో ఆమె ఈ విపరీత నిర్ణయం తీసుకుంది. ఒక్కసారిగా ఆమె పెట్రోల్ పోసుకోవడంతో అక్కడున్న ఇతర బాధితులు మరియు సామాన్య ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు తన పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని, తన గోడును ఎవరూ వినడం లేదని ఆమె పెద్దగా కేకలు వేస్తూ నిరసన వ్యక్తం చేసింది. శ్రావణి ఆత్మహత్యాయత్నాన్ని గమనించిన హెచ్ఆర్సీ భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు తక్షణమే స్పందించారు. ఆమె నిప్పు అంటించుకోకముందే అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, ఆమె చేతిలోని పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. అనంతరం ఆమెపై నీళ్లు పోసి ఎటువంటి ప్రమాదం జరగకుండా కాపాడారు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తనపై జరుగుతున్న అన్యాయాన్ని వివరించినా అధికారులు పట్టించుకోవడం లేదని, పైగా తననే ఇబ్బందులకు గురిచేస్తున్నారని శ్రావణి పోలీసుల వద్ద వాపోయింది. న్యాయం కోసం కమిషన్ కార్యాలయానికి వస్తే ఇక్కడ కూడా జాప్యం జరుగుతోందని, అందుకే ప్రాణత్యాగం చేయాలనుకున్నట్లు ఆమె వివరించింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో నాంపల్లి ప్రాంతంలో కాసేపు రాకపోకలు నిలిచిపోయి గందరగోళం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు అక్కడికి చేరుకుని శ్రావణిని విచారించారు. గత కొంతకాలంగా గాంధీనగర్ పోలీసులు ఒక సివిల్ వివాదంలో తలదూర్చి తనను, తన కుటుంబ సభ్యులను స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని ఆమె ఆరోపించింది. పోలీసుల వేధింపుల వల్ల మానసిక క్షోభకు గురవుతున్నానని, తన ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్నారని ఆమె కన్నీటిపర్యంతమైంది. పోలీసులు బాధితురాలిని అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమె చేసిన ఆరోపణలపై లోతైన దర్యాప్తు జరిపిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. బాధితురాలు శ్రావణికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాంధీనగర్ పోలీసుల వ్యవహారశైలిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించే అవకాశం ఉందని సమాచారం. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉన్న కార్యాలయాల వద్ద ఇలాంటి ఘటనలు జరగడం పట్ల మానవ హక్కుల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు బాధితుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వేధింపులకు పాల్పడితే ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతానికి శ్రావణి పరిస్థితి నిలకడగానే ఉందని, ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఉన్నతాధికారులు తదుపరి చర్యలు తీసుకోనున్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కమిషన్ వద్ద భద్రతను మరింత కఠినతరం చేశారు.

# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు




**రామన్నపేట ఏప్రిల్ 7**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని నిదానపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రామన్నపేట ఎస్ ఐ డి. నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ ఐ నాగరాజు మాట్లాడుతూ సైబర్ నేరాలపై జాగ్రత్తలు, కమ్యూనిటీ పోలీసింగ్ ప్రాధాన్యం, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, చైన్ స్నాచింగ్ నివారణ చర్యలపై గ్రామస్తులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ చిన్నారుల రక్షణలో సమాజ బాధ్యతను గుర్తుచేశారు. బాల్య వివాహాల నివారణపై చట్టపరమైన అంశాలను వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద ఘటనలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది నరసింహ, సురేష్, మధు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

# త్రిష రిటైర్మెంట్ గుసగుసలు ..
# గట్టిగా ఇచ్చి పడేసిన చెన్నై చంద్రం

దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ గురించి సంచలన వార్తలు వైరల్ అవుతున్నాయి. ఆమె తన సుదీర్ఘ సినీ ప్రయాణానికి త్వరలోనే ముగింపు పలకబోతున్నారనే ప్రచారం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ప్రాజెక్టులను మాత్రమే పూర్తి చేస్తూ, కొత్త సినిమాలకు సంతకం చేయకపోవడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి సరసన నటిస్తున్న విశ్వంభర చిత్రం ఆమె కెరీర్‌లో చివరి సినిమా కావొచ్చని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రముఖ సినీ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్ట్ చిత్ర లక్ష్మణన్ తన 'టూరింగ్ టాకీస్' ఛానెల్‌లో చేసిన వ్యాఖ్యలు ఈ వార్తలకు మరింత ఊతమిచ్చాయి. త్రిష ఇకపై సినిమాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నారని, కొంతమంది నిర్మాతలు తనకు ఈ విషయాన్ని వెల్లడించారని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ వార్తలపై స్పందించిన త్రిష..అవును నేను సినిమాలు మానేసి ఒక పెద్ద వ్యాపార వేత్తని వివాహం చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను.మీ ఆలోచనలకి ఈ సమాధానం సరిపోతుందా, మీరు వార్తలు రావడానికి ఇది సరిపోతుందా..లేక ఇంకేదైన స్టఫ్ కావాలా అంటూ త్రిష గట్టిగా కౌంటర్ ఇచ్చింది. ఇక ఇదిలా ఉంటే తమిళ స్టార్ విజయ్.. త్రిష సంబంధంపై గత కొంతకాలంగా సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వస్తున్నాయి. వీరిద్దరూ లివ్-ఇన్ రిలేషన్‌లో ఉన్నారనే ప్రచారం, అలాగే విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు కూడా ఈ రిటైర్మెంట్ గాసిప్‌కు మరింత ఊతమిచ్చాయి. ఇటీవల ఒక వివాహ వేడుకలో ఇద్దరూ ఒకే తరహా దుస్తుల్లో కనిపించడం, అక్కడి నుంచి కలిసి వెళ్లడం వంటి సంఘటనలు మీడియా దృష్టిని ఆకర్షించాయి. అయితే ఈ విషయాలపై వచ్చిన ప్రశ్నలకు త్రిష ఎలాంటి స్పందన ఇవ్వకపోవడం మరింత అనుమానాలకు దారితీసింది. కాగా, త్రిష నటించిన కరుప్పు(తెలుగులో 'వీరభద్రుడు') విడుదలకు సిద్ధంగా ఉంది. ఫాంటసీ నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో ఆమె పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు.



# వాణిజ్య విలువలతో అహోం



వివేక్ మిశ్రా, శృతిక జంటగా రూపొందనున్న సినిమా 'అహోం'. ప్రసాద్‌రాజు దర్శకుడు. దశరథ్ నిర్మాత. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో నిర్మితమవుతున్న ఈ పానిండియా చిత్రం ప్రారంభోత్సవం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. నిర్మాత కె.ఎస్.రామారావు, దర్శకుడు వి.వి.వినాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. వాణిజ్య విలువలతో కూడిన తాజా కథతో ఈ సినిమా రూపొందనున్నదని, దర్శకుడు ప్రసాద్‌రాజు అద్భుతమైన కథను రాసుకున్నారని నిర్మాత దశరథ్ చెప్పారు. అజయ్ ఘోష్, శాండీ, కోటకొండ కృష్ణ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ ఆనెం, సంగీతం: వివేక్-పునీత్, నిర్మాణం: ఈగల్ ఐ స్టూడియో ఇంటర్నేషనల్.

# మహిళలకు ఉచితం

స్వీయ నిర్మాణంలో పార్థా గోపాల్ హీరోగా నటించిన చిత్రం 'డైమండ్ డెకాయిట్'. సూర్య



జి యాదవ్ దర్శకత్వం వహించారు. మేఘనా రెడ్డి కథానాయిక. ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు ట్రైలర్‌ను వీక్షించి చిత్రబృందాన్ని అభినందించారు. ప్రతీ కుటుంబానికి కనెక్ట్ అయ్యే కథ ఇదని, మహిళలకు నాలుగు షోలను ఉచితంగా ప్రదర్శిస్తామని, మహిళా ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలని మేకర్స్ కోరారు. ఈ చిత్రానికి సంగీతం: పీఆర్, నిర్మాత: పార్థా గోపాల్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: సూర్య జి యాదవ్.

# అనిల్ రావిపూడి దర్శకత్వంలో యానిమేటెడ్ రామాయణం?



తెలుగు సినీరంగంలో వరుస సక్సెస్‌లతో దూసుకుపోతున్నారు అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో బ్లాక్‌బస్టర్ హిట్స్‌ని అందించడం ఆనవాయితీగా మార్చుకున్నారు. ప్రస్తుతం ఆయన వెంకటేష్-కల్యాణ్‌రామ్‌లతో ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని చేస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా అనిల్ రావిపూడి లైనప్‌లో ఓ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ గురించి చర్చ జరుగుతున్నది. భారతీయ పురాణేతిహాసం రామాయణ గాథను యానిమేటెడ్ వెర్షన్‌లో తెరకెక్కించేందుకు ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ సన్నాహాలు చేస్తున్నది. ఈ ప్రాజెక్ట్‌ను అనిల్ రావిపూడి డైరెక్ట్ చేయబోతున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. 2024లో వచ్చిన 'మహావతార్ నరసింహ' యానిమేషన్ ఫిల్మ్‌కు దేశవ్యాప్తంగా ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఈ నేపథ్యంలో రామాయణ ఆధారంగా ఓ యానిమేటెడ్ ఫిల్మ్‌కు కేవీఎన్ ప్రొడక్షన్ శ్రీకారం చుట్టిందని తెలిసింది. భారీ బడ్జెట్‌తో ఆధునిక సాంకేతిక హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, త్వరలో అధికారిక ప్రకటన ఉంటుందని సమాచారం.

# ఇకపై సింగిల్‌గానే ఉంటా..

ప్రేమ, పెళ్లి విషయాల్లో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తుంటుంది అగ్ర కథానాయిక శృతిహాసన్. గతంలో డూడుల్ ఆర్టిస్టు శంతను హజారికాతో సుదీర్ఘ ప్రేమాయణం నడిపిందీ భామ.

వారిద్దరూ పెళ్లిపీటలెక్కబోతు న్నారనే వార్తలు కూడా వచ్చాయి. అయితే అనంతర పరిణామాల్లో ఈ జంట విడిపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నటనపై దృష్టి పెట్టింది శృతిహాసన్. సెలెక్టివ్‌గా సినిమాల్ని ఎంచుకుంటున్నది. తాజా ఇంటర్వ్యూలో ఆమె తన బ్రేకప్ స్టోరీని పంచుకుంది. తాను ఇప్పటివరకు ఆరుసార్లు విఫల ప్రేమ అనుభవాల్ని చవిచూశానని, వాటివల్ల మానసిక సంఘర్షణకు లోనయ్యానని చెప్పింది. ప్రస్తుతం సినిమాలే ప్రపంచంగా ప్రశాంత జీవితం గడుపుతున్నానని, ఇక మీదట తాను ఒంటరిగానే ఉంటానని శృతిహాసన్ తెలిపింది. ప్రస్తుతం ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

